


ఉద్యోగం ఎందుకు ఇవ్వలేదు?

ఫైనల్ సెలెక్షన్ లిస్టులో తమ పేరు ఎందుకు లేదని, ఉపాధ్యాయ ఉద్యోగం ఎందుకు ఇవ్వలేదని విద్యాశాఖ అధికారులను డీఎస్సీ అభ్యర్థులు నిలదీశారు. 8లో▸



గంజాయి పట్టివేత

పంచలింగాల ఎక్సైజ్ చెక్‌పోస్టులో వాహన తనిఖీల సందర్భంగా 440 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. హైదరాబాద్ నుంచి తీసుకువస్తున్నట్లు తెలిసింది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10.524
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10.268

న్యూస్‌రీల్

యూనివర్సల్ ఆధార్ క్లయింట్‌పై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): ఆధార్ నమోదు, ఇతర సేవలకు సంబంధించి నూతనంగా ప్రవేశ పెట్టిన యూనివర్సల్ ఆధార్ క్లయింట్ సాఫ్ట్‌వేర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి జి.నాసరరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీస్ ఆఫ్ ఇండియా (యుఐడీఏఐ) ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్స్/ ఆధార్ ఆపరేటర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ నూతన సాఫ్ట్‌వేర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ఆధార్ సేవలను సకాలంలో పూర్తి చేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేలా కృషి చేయాలని కోరారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. యుఐడీఏఐ మాస్టర్ ట్రైనర్ ఎస్ వెంకటరమణ మాట్లాడుతూ నూతన సాఫ్ట్‌వేర్ యూనివర్సల్ ఆధార్ క్లయింట్ గురించి వివరించారు.

డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ సర్వీసెస్ డిప్లమా కోర్సులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమా కోర్సులైన డిప్లమా ఇన్ అనెస్తీషియా టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ, ఈసీజీ, క్యాథలాబ్, డయాలసిస్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫిక్, ఆప్తాల్మిక్, డార్క్‌రూమ్ అసిస్టెంట్ కోర్సులకు ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు భర్తీ చేసిన దరఖాస్తులను కర్నూలు మెడికల్ కాలేజిలో రూ.100 చెల్లించి అందజేయాలన్నారు. అక్టోబర్ 10వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేది వరకు స్వస్థ నారి సశక్తి అభియాన్(ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం)లో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, స్టేట్ నోడల్ ఆఫీసర్లు డిప్యూటీ డైరెక్టర్ రామనాథమ్, ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామీణ,పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిబిరాల్లో పరీక్షలతో పాటు వైద్య చికిత్సలు అందిస్తామన్నారు.

అంతంతమాత్రంగానే శనగ విత్తనాల కేటాయింపు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌కు శనగ విత్తనాలను కూటమి ప్రభుత్వం అరకొరగానే కేటాయించింది. రబీలో శనగ ప్రధాన పంట. కర్నూలు జిల్లాలో 70 వేల హెక్టార్లకుపైగా.. నంద్యాల జిల్లాలో 50 వేల హెక్టార్లలో పంట సాగు చేస్తున్నారు. ఈ మేరకు కర్నూలు జిల్లాకు 46 వేలు, నంద్యాల జిల్లాకు 25 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరమని మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు నివేదించారు. అయితే కూటమి ప్రభుత్వం తూతూమంత్రంగా కర్నూలు జిల్లాకు 23,897 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 12,564 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. 2024 రబీ సీజన్‌కు ప్రభుత్వం ఒక్క కర్నూలు జిల్లాకే 45,955 క్వింటాళ్లు కేటాయించింది. గత రబీలో కర్నూలు జిల్లాలో 30 వేల క్వింటాళ్లు, నంద్యాల జిల్లాలో 20 వేల క్వింటాళ్లు పంపిణీ అయ్యాయి. సాధారణంగా గత ఏడాది ఎంత మేర పంపిణీ అయింది.. ఈ సారి డిమాండ్ ఎంత అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని విత్తనాలు కేటాయిస్తారు. అయితే కూటమి ప్రభుత్వం ఇవేమి పట్టించుకోకుండా అరకొరగా కేటాయించి చేతులు దులుపుకోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కర్నూలు జిల్లాకు వేరుశనగ 4,715 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 449 క్వింటాళ్లు కేటాయించింది. నంద్యాల జిల్లాకు మినుములు 3,300 క్వింటాళ్లు కేటాయించింది. ఈ విత్తనాలను ఏపీ సీడ్స్ సిద్ధం చేస్తోంది.



మండల కేంద్రమైన తుగ్గలిలో రైల్వే బ్రిడ్జి కింద శిథిలమైన రోడ్డు

ఊరూరా దారిద్ర్యం

రోడ్లు శిథిలమై.. కష్టమైన ప్రయాణం

- నాడు హంగామా చేసిన 'కూటమి' నేతలు
- నేడు పెదవి విప్పని వైనం
- తూతూ మంత్రంగా గుంతల పూడ్చివేత
- పూడ్చిన నెల రోజుల్లోనే యథాస్థితి!
- టెండర్ దశ దాటని రూ.31.40 కోట్ల ప్రణాళిక పనులు

కర్నూలు(అర్బన్): ఆర్అండ్‌బీ రహదారులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారంలోకి రాక ముందు రోడ్ల దుస్థితిపై వివిధ రూపాల్లో టీడీపీ నేతలు హంగామా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెదవి విప్పడం మానేశారు. ఊరూరా ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నా, వాహనాలపై వెళ్తూ కింద పడి గాయపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రధాన రహదారులు పూర్తి స్థాయిలో ఛిద్రమయ్యాయి. ఈ రోడ్లపై ప్రయాణాలు చేయలేక వాహనదారులు అనేక ఇబ్బందులను పడుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి బడ్జెట్‌ను కేటాయించకుండా, కేవలం ప్యాచ్ వర్క్స్ (పార్ట్ హోల్) మాత్రమే చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం రూ.19.87 కోట్లతో 170 ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే అనేక ప్రాంతాల్లో చేపట్టిన ప్యాచ్ వర్కులు చేసిన నెల రోజులకే తిరిగి పాత రోడ్ల స్థానానికి చేరుకున్నాయి. వీటిని చూస్తే ఈ ప్యాచ్ వర్కులను ఎంత మాత్రం నాణ్యతతో చేశారో తెలుస్తోంది. జిల్లాలోని ప్రధాన రహదారులు గుంతలమయం కావడంతో చిన్న వాహనాల కంటే అధిక టన్నేజ్‌తో లారీలు వెళ్లలేకపోతున్నాయి. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరాయి. కర్నూలు జిల్లాలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. కంకర తేలిన రోడ్లపై పదుల కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితులను అనేక గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్నారు.

అడుగడుగునా గుంతలు

మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల మేర మోకాటి లోతు గుంతలు ఏర్పడడంతో హాల్వి – కోసిగి రోడ్డు పూర్తి దుర్భరంగా మారింది. హాల్వి నుంచి కోసిగికి మొత్తం 14 కిలోమీటర్లు కాగా, ఆర్లబండ క్రాస్ వరకు దాదాపు 3 నుంచి 4 కిలోమీటర్ల మేర రోడ్డు దారుణంగా మారిపోయింది. దీంతో ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సులు, ఆటోలు కూడా తిరగడం లేదు. దీంతో హాల్వి నుంచి మండల కేంద్రమైన కోసిగికి చేరుకునేందుకు ప్రజలు చిరుతపల్లి, మల్లన్నహట్టి, కరణి మీదుగా దాదాపు 13 కిలోమీటర్లు చుట్టు తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సాహసం చేసి ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసిన పలువురు కూడా ప్రమాదాల్లో గాయాలపాలయ్యారు.



హాల్వి - కోసిగి రోడ్డు



రాకపోక.. నరకయాతన

ఇది పత్తికొండ – గుత్తి ప్రధాన రహదారి. ఈ రోడ్డుపై గుంతలు పూడ్చేందుకు పార్ట్ హోల్ నిధులు రూ.13 లక్షలు వెచ్చించారు. పత్తికొండ నుంచి చెరువు తండా వరకు గుంతలు పూడ్చినట్లు అధికారులు చెబుతున్నా నెల రోజులకే యథాస్థానానికి చేరుకుంది. తుగ్గలి మండలం రాతన గ్రామ సమీపంలో ఇదే రోడ్డుపై రెండు నుంచి నాలుగు అడుగుల గుంతలు ఏర్పడ్డాయి. అలాగే మండల కేంద్రమైన తుగ్గలిలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పడిన గుంతలతో వర్షపు నీరు నిల్వ ఉండి వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులోనే జీ ఎర్రగుడి గ్రామం మెయిన్‌రోడ్డు పూర్తి గుంతల మయంగా మారింది.



చెరువు కాదు.. రోడ్డే!

ఆదోని పట్టణంలోని అర్డగేరి బస్టాండ్ నుంచి మాధవరం వేళ్లే రహదారి ఇలా కనిపిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రజలు హడలి పోతున్నారు. రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను ఆదోని మార్కెట్‌యార్డులో విక్రయించేందుకు ఈ రోడ్డు నుంచే రావాల్సి ఉంది. అయితే అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం లేదు. దీంతో ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలు చెరువులను మరిపిస్తున్నాయి. ఈ రోడ్డుపై నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటునే ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు పూర్తి స్థాయిలో వర్షపు నీటి మయంగా మారింది. ఇదే రోడ్డులో మరో ప్రాంతంలో రోడ్డుపై ఒక పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి సమయాల్లో అధిక శాతం ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

టెండర్ దశ దాటని ప్రణాళిక పనులు

జిల్లాలో రూ.31.40 కోట్లతో చేపట్టాల్సిన 12 ప్లాన్ వర్క్స్ (ప్రణాళిక పనులు) ఇంకా టెండర్ దశలోనే ఉన్నాయి. రోడ్లను వెడల్పు చేయడం, పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరిన రోడ్లను బాగు చేసేందుకు ఉద్దేశించిన ఈ రోడ్ల పనులు ఇంకా టెండర్ దశ దాటడం లేదు. ఈ నేపథ్యంలోనే ... కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నాబార్డు నిధులు రూ.18.81 కోట్లతో చేపట్టిన ఏడు పనులు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి.

కర్నూలు నగరంలో ఇలా..

కర్నూలు చౌరస్తా నుంచి పెద్దపాడు వరకు రోడ్డును విస్తరించి రోడ్డు మధ్యన డివైడర్లు వేశారు. యూటర్న్‌లు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎక్కడా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. రోడ్డుకు ఓ వైపున డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో వర్షాలు కురిసిన సందర్భాల్లో నీరంతా వస్తున్నాయి. దీంతో వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుపై లైటింగ్ కూడా లేకపోవడంతో రాత్రి సమయాల్లో పలు ప్రమాదాలు కూడా సంభవించాయి.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

కర్నూలు: శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం ఏపీ హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలని హైకోర్టు సాధన సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు హైకోర్టు సాధన సమితి నాయకులు రామాంజినేయులు, నరసింహులు, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయదేవత విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు న్యాయవాదులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. ఒకప్పటి ఆంధ్ర రాజధాని కర్నూలుకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రం అందించారు.

70 ఏళ్లు పైబడిన ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

కర్నూలు: 70 ఏళ్ల వయస్సు పైబడి, అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి.కబర్ధి, కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామ శివారులో ఉన్న పురుషుల జిల్లా కారాగారం, ఆర్‌డీఓ కార్యాలయం పక్కనున్న మహిళా కారాగారాన్ని మంగళవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేసి ఖైదీలకు క్లినిక్‌ల ప్రాధాన్యతను వివరించారు. ఇందులో ఒక అడ్వకేటు, పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఖైదీలకు న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయ సేవాధికార సంస్థ తరఫున న్యాయవాదిని ఏర్పాటు చేసి న్యాయ సహా యం అందిస్తామని, త్వరగా బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. న్యాయ సమస్యలు ఉంటే 15100 హెల్ప్‌లైన్ నంబర్‌కి సమాచారం ఇవ్వవచ్చన్నారు.

ఐదెకరాల వక్ఫ్ భూమి అన్యాక్రాంతం

- పరిశీలించిన వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారులు



వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(అర్బన్): కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలోని 301, 319, 320, 325, 324, 326 సర్వే నెంబర్లలోని వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతమైనట్లు తమ దృష్టికి వచ్చిందని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ ముక్తార్‌బాషా తెలిపారు. మంగళవారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్.సబీహా పర్వీన్, ఇతర మైనారిటీ అధికారులతో కలిసి ఈ భూములను పరిశీలించామన్నారు. ఆయా సర్వే నెంబర్లలో దాదాపు 42 ఎకరాలు వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములు ఉన్నాయన్నారు. ఇందులో దాదాపు ఐదు ఎకరాలు పూర్తి స్థాయిలో అన్యాక్రాంతమయ్యాయని.. పలు కట్టడాలు, సాగు చేస్తున్న భూములు ఉన్నాయన్నారు. అన్యాక్రాంతమైన ఈ ఐదు ఎకరాల భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్స్ కూడా జరిగినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. ఈ భూములకు రిజిస్ట్రేషన్స్ ఎలా జరిగాయనే విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి అక్రమ రిజిస్ట్రేషన్స్‌ను రద్దు చేయించేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే మరో 14 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములకు సంబంధించి గ్రామంలోని ప్రజలకు తహసీల్దార్ పట్టాలు ఇచ్చారని, ఈ పట్టాల విషయంపైనా తహసీల్దార్‌ను నివేదిక కోరతామన్నారు. పంచలింగాల గ్రామంలోని వక్ఫ్ బోర్డు భూములకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను తమ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ముక్తార్ బాషా తెలిపారు.

మెడికల్ కాలేజీలను నిర్వహించలేరా?

- అలాంటప్పుడు సీఎం పదవి ఎందుకు?
- రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారు
- పాలన అంటే ఇదేనా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి
- ఆదోని మెడికల్ కాలేజీని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్



ఆరేకల్ సమీపంలోని మెడికల్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించలేని వారికి సీఎం పదవి ఎందుకు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రానికి కొత్తగా 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చిందన్నారు. ఈ కళాశాలలను నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కుతుందని ఆరోపించారు. మెడికల్ కళాశాలలను నడపలేని వారు రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆదోని మండలం ఆరేకల్ గ్రామ సమీపంలో నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కళాశాలను ఎస్వీ మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో 12 మెడికల్ కళాశాలలు మాత్రమే ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం అనుమతులతో 17 కళాశాలలను మంజూరు చేయించారన్నారు. అందులో ఐదు మెడికల్ కళాశాలలు నిర్మాణాలు కూడా పూర్తి చేసి ఒకేసారి ప్రారంభించారన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు కూడా కేటాయించారని గుర్తు చేశారు.

ఉద్దేశపూర్వకంగానే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగానే పులివెందుల మెడికల్ కళాశాలకు మంజూరు చేసిన 50 సీట్లను రద్దు చేశారని ఎస్వీ మోహన్‌రెడ్డి ఆరోపించారు. మెడికల్ కళాశాలలను (పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం) పీపీపీ విధానంలో కొనసాగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు 40 సంవత్సరాల రాజకీయ అనుభవం, 14 సంవత్సరా లు ముఖ్యమంత్రిగా చేసిన అనుభవం ఉన్నా.. మెడి కల్ కళాశాలలను నడిపే సత్తా లేదా అని ప్రశ్నించారు.

అభివృద్ధి ఏదీ?

మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీలను విస్మరించారన్నారు. ఆదోని ప్రాంతంలో మెడికల్ కళాశాల పూర్తయితే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ గ్రామంలో కూడా అభివృద్ధి పనులు చేయలేదన్నారు.

అంతా అమరావతి జపమే!

పూర్తి చేసిన మెడికల్ కళాశాలలను ప్రారంభించలేని వారు రాష్ట్రాన్ని ఎలా పరిపాలిస్తారని ఎమ్మెల్సీ మధుసూదన్ ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం అమరావతి జపమే వినిపిస్తోందన్నారు. కూటమి నాయకులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడంలేదన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు శశికళ, వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నేత జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, పట్టణాధ్యక్షుడు దేవా, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, వీరస్వామి, బైచిగేరి గ్రామ సర్పంచ్ మహాదేవ, ఎస్సీ సెల్ పట్టణ నియోజకవర్గ అధ్యక్షుడు వై.పి.గంగాధర్, ఏసోబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిది కాదు



మెడికల్ కళాశాల ఎదుట చెరువును తలపిస్తున్న గుంతను పరిశీలిస్తున్న దృశ్యం

మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేయడం మంచిది కాదని ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదోని ప్రాంతంలో మెడికల్ కళాశాల పూర్తయితే ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా మెడికల్ కళాశాలలను పూర్తి చేసి ప్రయివేట్ వ్యక్తులకు కాకుండా ప్రభుత్వమే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనా కాలంలో రూ.3లక్షల కోట్లు అప్పు చేస్తే కూటమి ప్రభుత్వం ఒకటిన్నర సంవత్సరంలోపే రూ.2 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ఇంత అప్పు చేసినా మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎందుకు నడపలేకపోతున్నారని ప్రశ్నించారు.

క్లుప్తంగా

మందులకు వెళ్లి మృత్యుఒడిలోకి ...

● గుండెపోటుతో రైతు మృతి



మృతి చెందిన కురువ వేమన్న

కోసిగి: ఆరోగ్యం బాగా లేదు మందులు తెచ్చుకుంటానని ఇంటి నుంచి వెళ్లిన ఓ రైతు గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన కురువ వేమన్న (65)కు ఎకర సొంత పొలం, మరో 3 ఎకరాలు కౌలుభూమి ఉంది. ఇందులో రెండెకరాలు ఉల్లిపంట సాగు చేశాడు. ఉల్లి ధరలు పడిపోవడంతో పెట్టుబడి కూడా రాలేదు.మిగతా రెండెకరాల్లో వేసిన పత్తి పంట ఇటీవల కురిసిన వానలకు దెబ్బతినంది. ఈక్రమంలో పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో అనారోగ్యానికి గురయ్యాడు. మంగళవారం మందులు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి కోసిగికి వెళ్లిన అతను బస్టాండ్ సమీపంలో కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి లేపే ప్రయత్నం చేసేలోపు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య లసుమమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

భూసారంపై విద్యార్థులకు అవగాహన

● పీఎంశ్రీ కింద ఉమ్మడి జిల్లాలో 38 మోడల్ స్కూళ్ల ఎంపిక

కర్నూలు(అగ్రికల్చర్): భూమి ఎలా ఉండాలి.. నేలలో ఏఏ పోషకాలు ఉండాలి.. ప్రస్తుతం నేల పరిస్థితి ఎలా ఉంది... భూమి ఆరోగ్య స్థితి బాగుండాలంటే ఏమి చేయాలనే దానిపై కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. రాష్ట్రం మొత్తం మీద 297 మోడల్ స్కూళ్లను ఇందుకోసం వ్యవసాయ శాఖ ఎంపిక చేసింది. కర్నూలు జిల్లాలో 16, నంద్యాల జిల్లాలో 22 ప్రకారం మోడల్ స్కూళ్లను ఎంపిక చేశారు. ఈ స్కూళ్లలో రైతుకుటుంబాలకు చెందిన పిల్లలే చదువుతుంటారు. విద్యార్థి దశలోనే వారికి భూమి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వార భవిష్యత్తులో ప్రయోజనాలు ఉంటాయని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అక్టోబరు నెలలో ఈ కార్యక్రమం కార్యరూపం దాల్చనుంది.

అంతర్ జిల్లాల బైక్ దొంగ అరెస్ట్



పట్టుబడిన దొంగ, బైక్‌లను చూపుతున్న పోలీసులు

వెల్దుర్తి: ద్విచక్రవాహనాలు చోరీకి పాల్పడుతున్న అంతర్ జిల్లాల దొంగను అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం బుగ్గ సంగాల వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.కాగా పట్టుబడిన బైక్‌ల దొంగ పింజరి షేక్షావలి వెల్దుర్తి మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామ టీడీపీ కార్యకర్త. గతంలో బుక్ కీపర్‌గా విధులు నిర్వహించిన ఇతను కర్నూలు, అనంతపురం జిల్లాలలో బైక్‌ల చోరీలకు పాల్పడుతూ వస్తున్నాడు. అయితే, పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ఈ దొంగను ఈనెల 15వ తేదీన బుగ్గ సంగాల వద్ద కసాపురం పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి విలువైన బజాజ్ పల్సర్ 125 సీసీ బైక్‌లు నాలుగు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



ఉల్లి బస్తాల కోసం ఎగబడిన ప్రజలు



తోపుడు బండిపై తీసుకెళ్లేందుకు...



ఉల్లి బస్తాను ఎత్తుకెళ్తున్న దృశ్యం

వదంతులు నమ్మి.. ఉల్లిబస్తాలు ఎత్తుకెళ్లి!

మార్కెట్ యార్డులో ఉల్లి నిల్వలు పేరుకుపోయాయి. కొనేవారు లేకపోవడంతో రోజూ వందలాది క్వింటాళ్ల ఉల్లి కుళ్లిపోతోంది. అలాంటి వాటిని మార్క్‌ఫెడ్ పారబోస్తోంది. పారబోసే బదులు తమకు ఇస్తే గ్రేడింగ్ చేసుకొని వాడుకుంటాం కదా.. అనుకున్నారో.. ఏమో.. వందల మంది ప్రజలు మంగళవారం మార్కెట్ యార్డులోకి ప్రవేశించి ఉల్లి బస్తాలను ఎత్తుకెళ్లారు. పలువురు ద్విచక్ర వాహనాలు, తోపుడుబండ్లు, ఆటోల్లో వేసుకొని వెళ్లారు. మార్కెట్ కమిటీ అధికారులు అప్రమత్తమై 4వ పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు అక్కడికి చేరుకొని కట్టడి చేశారు. ఆధార్ కార్డు చూపించి రూ.100 చెల్లిస్తే బస్తా ఉల్లి గడ్డలు ఇస్తున్నారనే వదంతుల వల్లే ఇలా జరిగిందని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు.

– కర్నూలు(అగ్రికల్చర్)

6,588 క్వింటాళ్ల ఉల్లి వేలం



ఉల్లి వేలం పాటను పర్యవేక్షిస్తున్న జేసీ నవ్య

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి గడ్డలను మంగళవారం వేలం వేశారు. రూ.50, రూ.70, రూ.100 గరిష్ఠంగా రూ.360 ధర లభించింది. 6, 588 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు అమ్మకమయ్యాయి. 1,434 క్వింటాళ్ల ఉల్లి గడ్డలను కొనుగోలు చేసేందుకు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో డంప్ యార్డుకు తరలించనున్నారు. ఇప్పటికే ఉల్లి నాణ్యత పూర్తిగా దెబ్బతిని నీళ్లారుతోంది.

రేపు, ఎల్లుండి ఎమ్మిగనూరులో కొనుగోళ్లు

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లి తాకిడిని తగ్గించేందుకు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు చేపట్టనున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోళ్లకు విరామం ఇచ్చిన రోజుల్లో అక్కడ కొనుగోళ్లు చేపట్టే విధంగా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 17వ తేదీ కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లిని బయటికి తరలించేందుకు రెండు రోజుల పాటు సమయం తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే 18, 19 తేదీల్లో మార్కెట్‌కు రైతులు ఉల్లిగడ్డలు తీసుకురాకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ నవ్య కమీషన్ ఏజెంట్లకు ఆదేశాలు ఇచ్చారు. ఆ రెండు రోజులు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోళ్లు చేపడతామని మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తెలిపారు.

స్థానిక సంస్థలు ఆదాయ వనరులు పెంచుకోవాలి

● ఎంపీడీఓల శిక్షణ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులపై స్థానిక సంస్థలు ఆధారపడకుండా సొంత ఆదాయ వనరులను పెంచుకుంటే స్వయం ప్రతిపత్తి సాధించేందుకు అవకాశాలు ఏర్పడతాయని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అభిప్రాయపడ్డారు. స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలకు ' సొంత ఆదాయ వనరులు ' అనే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎస్ ఐఆర్‌డీ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమాలకు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్, ప్రకాశం జిల్లాకు డ్వామా విజిలెన్స్ అఫీసర్‌గా పదోన్నతిపై వెళ్తున్న గూడూరు ఎంపీడీఓ అశ్వినీకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులను పెంచుకుంటే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఇబ్బంది ఉండదన్నారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ రాయలసీమలోని వెనుకబడిన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సొంత ఆదాయ వనరులను పెంచుకోవడం తప్ప మరో మార్గం లేదన్నారు. ముఖ్యంగా తాగునీటి సదుపాయాలను గ్రామాల్లో మెరుగుపరచి నీటి పన్ను వసూళ్లకు కృషి చేయాలన్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో కొత్త ఆవిష్కరణలు చేపట్టి ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. డీపీఓ మాట్లాడుతూ ప్రజలు పన్నులు చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ గంగాధర్, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు వి. జేమ్స్ కృపావేరం, ఆష్రఫ్‌బాషా, పి. జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సీమ రైతుకు తీవ్ర అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న రాయలసీమ సాగు నీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

● కృష్ణా జలాలను నెల్లూరు వైపు తరలించే కుట్ర

● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

పాములపాడు: శ్రీశైలం ప్రాజెక్టు నీటి వినియోగంలో రాయలసీమ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు సాక్షిగా రాయలసీమ నీటి హక్కులపై ప్రభుత్వ దాడిని క్షేత్ర స్థాయిలో తెలుసుకునే కార్యక్రమం చేపట్టారు. రైతులతో కలిసి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉన్న రోజుల్లో రోజుకు 4 టీఎంసీల కృష్ణా జలాలను తీసుకునే విధంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44,000 క్యూసెక్కులకు పెంచారన్నారు. అనధికారికంగా ఎస్‌ఆర్‌బీసీ కాలువకు అడ్డుకట్ట వేశారని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు సాధారణంగా వరద నీటి ప్రవాహం 30 రోజులకు మించి ఉండదన్నారు. పెంచిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ల సామర్థ్యంతో 30 రోజుల్లో సీమలోని రిజర్వాయర్లు నింపాల్సి ఉందన్నారు. అయితే, నెలరోజుల్లో 40 టీఎంసీల నీటి తరలింపు జరగడం లేదన్నారు. ఫలితంగా ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందించలేని పరిస్థితి నెలకొందని చెప్పారు.

కృష్ణా జలాలను నెల్లూరుకు తరలించే కుట్ర

రాయలసీమ హక్కుగా ఉన్న నీటిని 30 రోజుల్లో జలశయాలకు తరలించేందుకు అవసరమైన పనులు చేపట్టాల్సిన పాలకులు, రెగ్యులేటర్ల నీటి ప్రవాహాన్ని మార్చి కృష్ణాజలాలను నెల్లూరు వైపు తరలించే కుట్ర చేస్తున్నారని బొజ్జా దశరథరామిరెడ్డి ఆరోపించారు. ఈ క్రమంలోనే రాయలసీమలో మరింత బలవంతపు భూ సేకరణ, కుందూ, గాలేరు తదితర నదులను కాలువగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని కలిసికట్టుగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్‌రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల సర్వే అడ్డగింత



తొగర్చేడు వద్ద రైతులతో మాట్లాడుతున్న సీఐడీ, రెవెన్యూ అధికారులు

కృష్ణగిరి: మా తాతల కాలం నుంచి భూములను మేము అనుభవిస్తున్నాం, కానీ ఇప్పుడు వచ్చి మీ భూములను అగ్రిగోల్డ్ సంస్థకు అమ్మారని సర్వే చేస్తామంటే ఒప్పుకోమని తొగర్చేడు గ్రామానికి చెందిన రైతులు కొండయ్య, గిడ్డయ్య, మద్దిలేటి, నాగేశ్వరమ్మ, పెద్ద ఎల్లయ్య తదితరులు అధికారులకు తెగేసి చెప్పారు. మంగళవారం సీఐడీ, రెవెన్యూ అధికారులు అగ్రిగోల్డ్ సంస్థ కొనుగోలు చేసిన పొలాలు సర్వే చేసేందుకు రైతులకు నోటీసులు ఇచ్చి వెళ్లారు. భూముల మీదకు సర్వేకు వచ్చిన సీఐడీ సీఐ గిరిబాబు, ఎస్ఐ రంగయ్య, తహసీల్దార్ ప్రకాష్‌బాబును రైతులు అడ్డుకొని తమ గోడు వినిపించారు. ఈ పొలాలే ఆధారమై జీవిస్తున్న తమకు అన్యాయం చేస్తే కుటుంబాలతో రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కృష్ణగిరి మండల పరిధిలో తొగర్చేడు, రామకృష్ణాపురం, కృష్ణగిరి గ్రామాల పరిధిలో 2011లో 440 ఎకరాలు అగ్రిగోల్డ్ సంస్థ కొన్నట్లు రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయన్నారు. అయితే, ఈ సంస్థ ఆస్తులను గుర్తించి వాటి ద్వారా వచ్చే మొత్తాన్ని బాధితులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే, భూముల మీదకు వెళ్లినప్పుడు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తామన్నారు. అలాగే ఈ భూముల్లో కొంత వరకూ అక్రమాలు జరిగినట్లు గతంలోనే గుర్తించామన్నారు. మీ స్వాధీనంలో ఉండే భూములను మీరు కాకుండా వేరే వ్యక్తులు అమ్మినట్లు ఆధారాలు తీసుకవస్తే న్యాయం చేస్తామని తెలిపారు.

ప్రైవేట్ స్కూళ్ల తనిఖీలకు కమిటీలు



కీర్తి హైస్కూల్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

కర్నూలు సిటీ: నగరంలోని అన్ని ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేసేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నామని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ తెలిపారు. ప్రత్యేక కమిటీ సభ్యులు ప్రైవేట్ స్కూళ్లలో భవనాల భద్రతను, అనుమతులను తనిఖీ చేస్తారన్నారు. కర్నూలు కవాడీవీధిలోని కీర్తిహైస్కూల్‌లో గోడ కూలి ఓ విద్యార్థి రాఖీబ్ మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి కుటుంబ సభ్యులను మంగళవారం డీఈఓ పరామర్శించారు. అదే విధంగా డీఈఓకు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి..విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థి కుటుంబానికి సొంతఇల్లు లేకపోతే ఇంటి స్థలం మంజూరు చేయాలని ఆర్డీఓను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.పిల్లలను చదివించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కీర్తి హైస్కూల్‌లో కూలిన గోడను డీఈఓ శ్యామూల్ పాల్ పరిశీలించారు. విద్యార్థి మృతి ఘటనపై పాఠశాల వివరణ కోరామని, వారి నుంచి ఎలాంటి వివరణ రాలేదన్నారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఈఓ పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత





గంజాయితో పాటు బొలెరో వాహనాన్ని సీజ్ చేసి మీడియాకు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు: నగర శివారులోని పంచలింగాల ఎక్సైజ్ చెక్‌పోస్టులో వాహన తనిఖీల సందర్భంగా గంజాయి పట్టుబడింది. కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్, ఎస్ఐ దుర్గా నవీన్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం పంచలింగాల చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అలంపూర్ వైపు నుంచి బొలెరో వాహనం వచ్చింది. అందులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండగా వాహనం ఆపి తనిఖీ చేయగా 440 గ్రాముల ఎండు గంజాయి బయటపడింది. వాహనంలో ఉన్న కర్నూలు టీచర్స్ కాలనీకి చెందిన ఈడిగ శ్రీనివాసులు గౌడ్, చైతన్య నగర్‌కు చెందిన బండ శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా హైదరాబాద్ నుంచి గంజాయి తీసుకు వస్తున్నట్లు అంగీకరించారు. చిన్న పొట్లాలుగా తయారు చేసి విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో తెచ్చినట్లు ఒప్పుకున్నారు. దీంతో ఇరువురిని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి వాహనంతో పాటు గంజాయిని సీజ్ చేశారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది రంగయ్య, చంద్రపాల్, రామలింగయ్య, సుదర్శన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు డీడీలకు జేడీలుగా పదోన్నతి

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖలో ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఆర్‌టీ నెంబర్ 327 జారీ చేసింది. కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న వి.దుర్గాప్రసన్నబాబును జేడీగా పదోన్నతిపై డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఆదోని డివిజన్ డీడీగా పనిచేస్తున్న పి.వెంకటరమణ శ్రీకాకుళం జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఏడీలకు డీడీలుగా పదోన్నతి కల్పించడం ద్వారా ఈ స్థానాలు భర్తీ కానున్నాయి.

ఉపాధ్యాయ ఉద్యోగం ఎందుకు ఇవ్వరు?

● డీఈఓ కార్యాలయానికి భారీగా వచ్చిన డీఎస్సీ అభ్యర్థులు



డీఈఓ కార్యాలయంలో విద్యాశాఖ ఉద్యోగులను నిలదీస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు సిటీ: 'డీఎస్సీలో ర్యాంకులు తెచ్చుకున్నాం.. కాల్ లెటర్లు పంపించారు.. మూడు విడతల్లో సర్టిఫికెట్లు పరిశీలన చేశారు.. అయినా ఫైనల్ సెలెక్షన్ లిస్టులో మా పేరు లేదు.. ఉపాధ్యాయ ఉద్యోగం ఎందుకు ఇవ్వరు' అని విద్యాశాఖ అధికారులను డీఎస్సీ అభ్యర్థులు ప్రశ్నించారు. వందలాది మంది మంగళవారం కర్నూలు డీఈఓ కార్యాలయానికి వచ్చారు. 'ఒక్కో పోస్టుకు ఒకరినే ఎంపిక చేసి సర్టిఫికెట్లు పరిశీలించామని చెప్పి ఇంత మోసం చేస్తారా' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థుల ఆవేదన విన్న తరువాత డీఈఓ ప్రత్యేకంగా ఓ సెల్ ఏర్పాటు చేశారు. ఐదారుగురు హెచ్‌ఎంలను అక్కడ ఉంచి అభ్యర్థుల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన వినతులను పరిశీలించిన డీఈఓ శామ్యూల్ పాల్.. ఏఏ అభ్యర్థి ఎందుకు ఉద్యోగానికి ఎంపిక కాలేదో వివరించారు. మరికొంత మందికి హెచ్‌ఎంలు వివరించారు. డీఈఓ కార్యాలయంలో ఓ ఉద్యోగి నిర్లక్ష్యంతో ఈడబ్ల్యూఎస్ కోటాలో ఉద్యోగాన్ని కోల్పోయానని ఓ నిరుద్యోగి ఆందోళన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను అందజేసినా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేదన్నారు. ఈ విషయంపై బాధితుడు సదరు ఉద్యోగిని అడిగితే తనకు ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదని అంటున్నట్లు తెలుస్తోంది.

108 వాహనంలోనే ప్రసవం

డోన్ టౌన్: కాన్పు కోసం వెళ్తున్న ఇద్దరు నిండు గర్భిణులు 108 వాహనంలోనే మంగళవారం ప్రసవమయ్యారు. డోన్ మండలం బోంతిరాళ్ల గ్రామానికి చెందిన త్రివేణి పురిటి నొప్పులతో 108లో కర్నూలుకు వెళ్తుండగా మార్గమధ్యంలో టోల్‌గేట్ వద్ద ప్రసవం అయ్యారు. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత తల్లిని, బిడ్డను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెల్దుర్తి నుంచి మరో నిండుగర్భిణిని ప్రసవం కోసం 108 వాహనంలో తీసుకెళ్తుండగా ఆమె కూడా మార్గమధ్యంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. ఒకేరోజు ఒకే 108లో రెండు ప్రసవాలు అయ్యి తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు.

బెంగాలీ నాట్లు.. తప్పిన కూలీ పాట్లు!

● వరి నాట్లకు బెంగాలీ కూలీలు

● ఖర్చు తగ్గుతుండటంతో ఆసక్తి చూపుతున్న రైతులు

● తీరిన కూలీల కొరత



నాట్లు వేస్తున్న బెంగాలీలు

గోస్పాడు: జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో అధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. ఈ క్రమంలో ఏటా నాట్ల సమయంలో కూలీల కొరత తీవ్రంగా రైతులను వేధిస్తుండేది. ఈ సమస్య పరిష్కారమయ్యేలా బెంగాలీ కూలీలు జిల్లాకు చేరుకున్నారు. నాట్లు వేయడంలో వీరికి ప్రత్యేకత ఉండటంతో రైతులు బెంగాలీ నాట్లు వేస్తున్నారు. స్థానిక కూలీల విధానంలో నాట్లు వేస్తే పెట్టుబడి ఖర్చు కూడా భారీగా పెరుగుతోంది. అలాగే ఎకరానికి 25 కిలోల విత్తనాలు నారు కోసం వినియోగిస్తారు. కాగా బెంగాలీ కూలీలు లేత నారుతో వేగంగా వేస్తారు. ఎకరాకు 15 కిలోలు విత్తనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. వీరు వేసిన నాట్లు నాలుగైదు రోజుల్లో పైరు తిరుగుతుండగా స్థానిక కూలీలు వేసిన నాట్లు పైరు తిరగాలంటే పది రోజులు పడుతుంది. నాట్లకు స్థానిక కూలీలు ఆరుగురు అవసరమైతే బెంగాలీలు నలుగురు సరిపోతారు. వీరు వేసే నాటులో వాడే నారుతో పోల్చితే స్థానికులు నారును అధికంగా వినియోగిస్తారు. స్థానిక కూలీలతో పోలిస్తే బెంగాలీ నాట్లు వల్ల రైతులకు ఖర్చులు బాగా తగ్గుతాయి. ఈ విధానంతో రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ఈ ఏడాది దాదాపు 30 శాతం బెంగాలీ నాట్లు వేసినట్లు తెలుస్తోంది.

పొలం వద్దే వంటావార్పు..

బెంగాలీలు పొలాల వద్దే వంటావార్పు చేసుకుని పనులు చేస్తున్నారు. గ్యాస్‌పొయ్యి, వంటపాత్రలు వెంట పట్టుకొని పొలాల వద్ద వాలిపోతారు. సమయానికి అక్కడే పొలం గట్లపై భోజనాలు చేయడంతో సరిపెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు. స్థానికులతో పోల్చితే వారు నాట్లు వేసే విధానం వేగంగా తక్కువ సమయంలో పూర్తవుతుండటంతో చూపరులను ఆకట్టుకుంటుంది. ఉదయం నుంచే చీకటి పడేవరకు పొలాల్లోనే ఉంటు పనులు చేస్తున్నారు.

కొంత ఖర్చు తగ్గుతుంది



బెంగాలీ నాట్లు విధానం చాలా బాగుంది. ఖర్చు తగ్గి రైతులకు కొంత మేరకు లాభదాయకంగా ఉంటుంది. నారు పీకడం, మోత, నాటు వేయడం పనులు వారే చేస్తారు. బెంగాలీ విధానంలో ఎకరాకు సెంటున్నర నారు మాత్రమే వాడుతున్నారు. నారు కూడా బాగా తక్కువగా అవసరమవుతుంది. సాధారణంగా వేసే నాట్లు కంటే వీరు తొందరగా పూర్తి చేస్తున్నారు. – నాగేశ్వరరెడ్డి, సాంబవరం, రైతు

ఏటా ఈ ప్రాంతానికి వస్తాం



బెంగాల్ నుంచి ప్రతి ఏడాది ఈ ప్రాంతానికి వలసగా వస్తుంటాం. వరినాట్లు వేసేందుకు సీజనల్‌లో బెంగాల్ నుంచి 40 నుంచి 50 మందితో గుంపులుగా వచ్చి ఇక్కడి ప్రాంతంలో వరినాట్లు వేసే పనులు చేస్తున్నాం. కడుపు తిప్పల కోసం సుదూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తుంది. సీజన్‌లో మాత్రమే ఇలాంటి పనులు ఉంటున్నాయి. వంటలు కూడా పొలాల వద్దే వంట చేసుకొని ముందుకు సాగుతున్నాం. –మామున్ని, పశ్చిమబెంగాల్ కూలీ